
ప్రజాశక్తి

శుక్రవారం 21 జులై 2023 | 5 | విజయనగరం





జగ్గయ్యపేట పొలాల్లో వరి నాట్లు వేస్తున్న రైతులు

వరినాట్లు ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో వరినాట్లు ప్రారంభమయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువులు, పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఉబాలు ప్రారంభించారు. వ్యవసాయ బోర్లు ఉన్న చోట కూడా వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు.



సాగుభూముల వద్ద ఆందోళన చేస్తున్న గిరిజనులు, సిపిఎం నాయకులు

సాగుపట్టాల కోసం ఎదురుచూపులు

వారంతా గిరిజనులు. చదువు రాని నిరక్ష్యరాసులు... చాలా మందికి సొంత భూమి కూడా లేదు. దీంతో, తమ పరిసర ప్రాంతాల్లోవున్న ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటూ 30ఏళ్లగా ఫలసాయం పొందుతున్నారు. ఈనేపథ్యంలో సుమారు ఏడెనిమిదేళ్లగా తమకు సాగుపట్టాలు ఇవ్వాలని కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు కాళ్లరిగేలా తిరిగారు. ప్రభుత్వం స్పందించకపోవడాన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది పెత్తందారులు తప్పడు ధ్రువీకరణ పత్రాలతో భూమిని దఖలు పర్చుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈనేపథ్యంలో గిరిజనులకు న్యాయం చేయాలంటూ సిపిఎం, గిరిజన సంఘం సయుక్త ఆధ్వర్యాన ఆందోళనా కార్యక్రమాలు చేపడుతున్నారు.

- మూడు దశాబ్దాలుగా పట్టించుకోని పాలకులు
- ఇదే అదునుగా తప్పడు ధ్రువపత్రాలు సృష్టించుకున్న పెత్తందారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మెంటాడ మండలం ఆగూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 239, 240, 241, 242 సర్వే నెంబర్లలో సుమారు 70 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అదంతా కొండప్రాంతం కావడంతో దట్టమైన చెట్లు, ముళ్ల పొదలతో ఒకప్పుడు చిట్టడవిని తలపించేది. ఈనేపథ్యంలో ఆ చుట్టుపక్కల ఉన్న మెంటాడ మండలం సంగంగుడ్డివలస, పనుకువలస, కొత్తగూడెం, గజపతినగరం మండలం సిడగంవలస, రావివలస, ఎర్రాడ వలస గ్రామాలకు చెందిన 79 గిరిజన కుటుంబాలు 30ఏళ్ల క్రితం ఆక్రమించుకుని జీడి, మామిడి మొక్కలు నాటుకున్నారు. సుమారు 20ఏళ్లగా ఫలసాయాన్ని కూడా పొందుతున్నారు. ఇదే వీరికి జీవనాధారం. ఫలసాయాన్ని సంతల్లో విక్రయించుకుని కుటుంబాలను నెట్టుకొస్తున్నారు ఆ గిరిజనులు. ఈ నేపథ్యంలో గిరిజన హక్కుల చటం ప్రకారం లేదా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల కింద సాగుదారులందరికీ భూమిపై హక్కు కల్పించాలని సుమారు ఏడెనిమిదేళ్లగా సిపిఎం, గిరిజన సంఘం డిమాండ్ చేస్తోంది. వివిధ రూపాల్లో గిరిజనులు నిరసన తెలియజేసినప్పటికీ ప్రభుత్వం నుంచి కదలిక లేకపోవడంతో కొంతమంది పెత్తందారులు ఈ భూమిపై కన్నువేసినట్టు సమాచారం. గిరిజనుల సాగుకన్నా ముందు కొంతమంది సాగులో ఉన్నట్టు, వారి నుంచి కొనుగోలు చేసుకున్నట్టు పెత్తందారులు ధ్రువీకరణ పత్రాలు కూడా తయారు చేసుకున్నారు. దీంతో, సాగుదారుల్లో అభద్రతా భావం పెరుగుతోంది. ఇన్నాళ్లూ కష్టపడి అరకపట్టి, మొక్కలు నాటితే ఫలసాయం అందుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు భూమి తమదంటూ బుకాయిస్తున్నారని సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సిపిఎం నాయకులు రాకోటి రాము, గొర్లె శ్రీనివాసరావు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విచారణ చేపట్టి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ క్షేత్ర స్థాయి పరిశీలనకు ఆర్ఐ, విఆర్ఒలను కూడా పంపారు. అది ప్రభుత్వ భూమి అని తేలింది. కానీ, వీరికి సాగుపట్టాలు ఇచ్చేందుకు చొరవ చూపడం లేదు. మరోవైపు ఈ భూములు తమవేనంటూ బుకాయిస్తున్న పెత్తందారుల సంగతి తేల్చేందుకు కూడా వెనుకాడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని, గిరిజనులకు న్యాయం చేయాలని లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని సిపిఎం నాయకులు హెచ్చరిస్తున్నారు.

ప్రశ్నించే వారిపై కేసులు సరికాదు

పలుచోట్ల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసనలు



చీపురుపల్లిలో ర్యాలీ చేపడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమస్యలపై ప్రశ్నించే విద్యార్థులపైనా, విద్యార్థి నాయకులపై అక్రమకేసులు పెట్టడాన్ని ఖండిస్తూ నగరంలోనిప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గురువారం విద్యార్థులు నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సౌమ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత రెండేళ్లగా పాఠ్య పుస్తకాలు ఇవ్వడం లేదని, దీనివల్ల విద్యార్థులు చదువుకోడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజనవసతి, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని విజయవాడలో గల రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు వద్ద ఈనెల 19న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా చేపట్టారని తెలిపారు. ఈ సందర్భంగా 47మంది నాయకులను అరెస్టు చేశారని, మహిళలని కూడా చూడకుండా ఈడ్చుకెళ్లడం సరికాదని అన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యం కాదని, పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వెంటనే పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాలని లేదంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాజు, పి.రమేష్, పట్టణ కమిటీ సభ్యులు లావణ్య, షణ్ముఖ, వెంకటరమణ, యర్రమ్మ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : దీర్ఘకాలంగా వెంటాడుతున్న లక్కవరపుకోట ఉన్నత పాఠశాల సమస్యలపై స్థానిక డిప్యూటీ తహశీల్దార్ రాజేశ్వరరావుకు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చిన్నబాబు ఆధ్వర్యాన వినతి అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష , రవికుమార్ పాల్గొన్నారు.

బాడంగి : ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టులకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శ హరికృష్ణ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాడంగి మండల కార్యదర్శి తేజ, నాయకులు కృష్ణ, వినయ్ పాల్గొన్నారు.

గరివిడి : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చీపురుపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేశ్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ నాయకుల అరెస్టులను ఖండించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల సదుపాయం దారుణంగా ఉందన్నారు. ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.వెంకీ, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.రామకృష్ణ, నాయకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వి.చినబాబు, మండల కార్యదర్శి కె.రమేష్, మండల సహాయ కార్యదర్శి మనోజ్, ఉపాధ్యక్షులు రాము, నాయకులు చైతన్య, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.



విజయనగరంలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు



హైవే పనులు చేపడుతున్న ప్రాంతంలో అడ్డంగా నిలబడిన విద్యార్థులు

హైవే పనులు అడ్డగింత


రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

ప్రజాశక్తి-మెంటాడ

మెంటాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ఆందోళనబాట పట్టారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా రింగ్ ఏర్పాటుకు అధికారులు పూనుకున్నారు. పాఠశాల ఆవరణలో శిథిల భవనం తొలగించారు. ఇంకో మూడు భవనాలతోపాటు మరుగు దొడ్ల తొలగింపునకు ప్రయత్నిస్తుండగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పనులను అడ్డుకున్నారు. తమకు ప్రత్యామ్నయంగా తరగతి గదులు, మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.రాము మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలాడు కుంటోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థినులు ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఎలా వెళతారని ప్రశ్నించారు. నాలుగు భవనాలు, నాలుగు మరుగుదొడ్లకు సుమారు మూడు కోట్లు పరిహారం అందించి ఆర్నెల్లు అయినా ఇంకా భవన నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభించలేదని నిలదీశారు. పనులు ప్రారంభించిన అనంతరం భవనాలు తొలగింపు కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనకు సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు గంద్రేటి అప్పలనాయుడు మద్దతు ప్రకటించారు. అనంతరం అక్కడకు వచ్చిన తహశీల్దార్ రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలి

తహశీల్దార్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు



లక్కవరపుకోటలో రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న విఆర్ఎలు, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద విఆర్ఎలు గురువారం నిరాహారదీక్షలు చేపట్టారు. విజయనగరం తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గురుమూర్తి, మండల కార్యదర్శి గోపాల్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో విఆర్ఎల సమస్యలను పరిష్కరిస్తానని, వేతనం పెంచుతామని హామీ ఇచ్చిన సిఎం అధికారంలోకి వచ్చిన తరువాత కనీసం వాటిని పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుత ధరల్లో రూ.10,500 జీతంతో ఎలా బతకాలని, ఉద్యోగులమని చెప్పి సంక్షేమ పథకాలను కోత పెట్టారన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 7, 8 తేదీల్లో కలెక్టరేట్ వద్ద, ఆగస్టు 25 న విజయవాడలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కాబోతున్నామని తెలిపారు. సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ. జగన్మోహన్‌రావు, బి.రమణ, నగర ఉపాధ్యక్షులు త్రినాథ్ మద్దతు ప్రకటించారు. రిలే నిరాహార దీక్షలో సన్యాసప్పడు, రాములప్పుడు, పెంటయ్య, గౌరీ, అప్పారావు, వీరస్వామి, జైపాల్, ఆదినారాయణ, బంగారయ్య, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి : రేగిడి తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో జగన్, పాదాలరావు, రాజు, పోలయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

భోగాపురం : భోగాపురం తహశీల్దార్ కార్యాలయం ముందు విఆర్ఎల సంఘం గౌరవ అధ్యక్షులు బి.సూర్య నారాయణ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు బి.చంద్రరావు, దుర్గ, శ్రీను, శివ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నెల్లిమర్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎల సంఘం మండల అధ్యక్షులు నేతల సూరిబాబు ఆధ్వర్యాన విఆర్ఎలు నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు బి.కృష్ణ, బి.అబద్దం, జి.రమణ, ఎం.సూర్యనారాయణ, బి. రాము, జె.అప్పారావు పాల్గొన్నారు.

లక్కవరపుకోట : సిఐటియు ఆధ్వర్యంలో లక్కవరపుకోట తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గాడి అప్పారావు, మండల అధ్యక్షులు తరిణి వెంకటరమణ, విఆర్ఎలు కె.రాంబాబు, తలారి మహేష్, రామచంద్రుడు, గొల్ల అర్జున, మునురి దేముడు పాల్గొన్నారు.


వేపాడ : వేపాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎలు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండల అధ్యక్షులు గట్టు వెంకన్న, విఆర్ఎలు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలస తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్ఎల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు చుక్క సూరిబాబు, దెందెటి మహేష్ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. దీక్షలకు సిఐటియు నాయకులు గాడి అప్పారావు మద్దతు ప్రకటించారు.

శృంగవరపు కోట : శృంగవరపుకోట పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో విఆర్ఎలు నిరాహార దీక్షలను చేపట్టారు. వీరికి సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మద్దతిచ్చారు. కార్యక్రమంలో విఆర్ఎల సంఘం మండల అధ్యక్షులు టి.అప్పారావు, నరవ దేవుడమ్మ, జి. మురళి అప్పారావు, ఎ.దేవుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గరివిడి : గరివిడి తహశీల్దార్ కార్యాలయం ఎదుట విఆర్ఎలు నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సిఐటియు నాయకులు అంబల్ల గౌరినాయుడు ప్రారంభించారు.





విజయనగరం, భోగాపురంలో దీక్షల్లో పాల్గొన్న విఆర్ఎలు, సిఐటియు నాయకులు

నేటి నుంచి ఓటర్ల జాబితాల తనిఖీ

జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా జూలై 21 నుంచి నె రోజు పాటు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా తనిఖీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి తెలిపారు. బూత్ స్థాయి అధికారు ఇంటింటికీ వచ్చి ఓటర్ల జాబితా తనిఖీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్తి సమాచారం అందించడం ద్వారా స్వచ్ఛమైన, తప్పొలు లేని ఓటర్ల జాబితా రూపొందించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఎలాంటి ఇంటి నంబరూ లేని ఓటర్లను గుర్తించి వారికి డోర్ నంబర్ కేటాయిస్తామని, ఒకే డోర్‌నెంబరులో ఎక్కువ మంది ఓటర్లు నమోదైన చోట గ్రామ, వార్డు కార్యదర్శులు గుర్తించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. బూత్ స్థాయిలో బి.ఎల్.ఓ.తో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తమ ఏజెంట్లను ఇంటింటి తనిఖీల్లో పాల్గొనేలా చేయవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1848 మంది బూత్ స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.

మణిపూర్‌లో ఉన్మాదులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మణిపూర్ రాష్ట్రంలోని ఒక ప్రాంతంలో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి, ఊరేగించి, అత్యాచారం చేసిన ఘటనను ఐసిఇయు నాయకులు ఒక ప్రకటనలో ఖండించారు. కఠోర కర్కశమైన ఘటనను, దానిపై శ్రద్ధ వహించని ప్రభుత్వ యంత్రాంగపు నిర్లక్ష్యాన్ని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, మహిళా విభాగం విశాఖపట్నం డివిజన్ మహిళా కన్వీనర్ సూర్యప్రభ, జి. వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస ఖండించారు. మణిపూర్‌లోని జాతుల కలహాలు, ఇద్దరు యువతులను వివస్త్రలను చేసే స్థాయికి దిగజారుతుంటే విశ్వగురువులమని ప్రగల్భాలు పలికే పెద్దలు ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. బయటపడిన సంఘటనను పక్కనపెట్టి అది ప్రసారమవుతున్న సోషల్ మీడియా సంస్థలపై కన్నెర్ర చేయడం ఏ రకమైన విజ్ఞత? తప్పులు ఎవరివి శిక్షలు ఎవరికి? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాల పేరుతో మోసం

డబ్బులు అడిగినందుకు బాధితురాలిపై దాడి • నిరసనగా ర్యాలీ, ధర్నా



ధర్నా చేస్తున్న బాధితురాలి కుటుంబ సభ్యులు, మహిళలు

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

బొబ్బిలి పట్టణంలోని స్వామివారివీధిలో నివాసముంటున్న మున్సిపల్ టీచర్ చింతల సింహాచలం భార్య లక్ష్మి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసి మోసగించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్వామివారివీధికి చెందిన కర్రి ప్రభావతికి లక్ష్మితో స్నేహం ఉండడంతో ఇంటి పనులు చేసుకునేందుకు ఆమెను వినియోగించుకునే వారు. తన కుమారుడు డాక్టర్ అని, ఉద్యోగాలు ఇప్పిస్తారని, ఎవరైనా ఉంటే చెప్పాలని ప్రభావతికి లక్ష్మి చెప్పారు. దీంతో తన సోదరి పిల్లలు ఉన్నారంటూ వారి ఉద్యోగాల కోసం విడతల వారీగా రూ.10 లక్షలను ప్రభావతి.. లక్ష్మికి ముట్టజెప్పారు. ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో ఆమె ప్రశ్నిస్తే, డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పారు. రోజులు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితురాలు ప్రభావతి గట్టిగా అడిగే సరికి, ఉపాధ్యాయుడు సింహాచలం, భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు కలిసి ఆమెపై దాడి చేశారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితురాలు ప్రభావతి వాపోయారు.

గతంలో చింతల లక్ష్మి చిట్టీల పేరుతో రూ.2 కోట్ల వరకు ఎగణామం పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయని బిఎస్‌పి జిల్లా కన్వీనర్ సొరు సాంబయ్య అన్నారు. ఉద్యోగాల పేరుతో మోసం చేసి, పద్మావతిపై దాడి చేసిన టీచర్ చింతల సింహాచలం, భార్య లక్ష్మి, కుమారులపై చర్యలు తీసుకోవాలని గురువారం పొట్టి శ్రీరాములు మున్సిపల్ పాఠశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ధర్నా నిర్వహించారు. తక్షణమే టీచర్ కుటుంబాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శుక్రవారం నిర్వహించ వలసిన ప్రభుత్వ ఉద్యోగుల గ్రీవెన్స్‌డే ను ఈనెల 21న నిర్వహిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు తమ సమస్యలను తెలుసుకునేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు సంబంధించిన సమస్యలు తెలుసుకుంటారని, జిల్లాలోని ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు.

ప్రైవేట్ ట్రావెల్స్ లో విజిలెన్స్ తనిఖీలు

విజయనగరం : వివిధ ప్రాంతాల నుంచి నగరంలోకి పలు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ద్వారా వస్తున్న పార్శిల్ లపై ప్రాంతీయ విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. జిఎస్‌టి అధికారులతో కలిసి ట్రావెల్స్ లో వచ్చిన పార్శిల్ బిల్లులు తనిఖీ చేశారు. కొనుగోలు బిల్లులు లేని పార్శిల్ లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సిఐ ఆర్.అప్పల నాయుడు, డిఇ సిహెచ్ సత్యనారాయణ, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ చంద్రకళ పాల్గొన్నారు. ప్రాంతీయ విజిలెన్స్ అధికారి ఎ. సురేష్ బాబు ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.

24న రైతు సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైతు సంఘాల సమన్వయకమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24న ఎన్‌పిఆర్ భవనంలో జరిగే రైతు సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు నిచ్చింది. గురువారం జిల్లా రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం ఎన్‌పిఆర్ భవన్‌లో జరిగింది. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు చల్లా జగన్, జిల్లా కమిటీ సభ్యుడు సిరపరపు కృష్ణం నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం (దాసరి భవన్) కార్యదర్శి పురం అప్పారావు, రైతుకూలీసంఘం కార్యదర్శి హెచ్.మల్లేష్లు మాట్లాడారు. గత ఏడాది ఢిల్లీ రైతు ఉద్యమం నేపథ్యంలో మోడీ ఇచ్చిన లిఖిత పూర్వక హామీలకు ఇప్పటికీ చట్టబద్ధత కల్పించకపోవడంతో ఆగస్టు నుంచి మలిదశ ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో సదస్సులు నిర్వహించి, ఆ సదస్సులో విశాలమైన రైతు సంఘాలు, రైతు శ్రేయోభిలాషులు పలు సంస్థలు కలుపుకొని ముందుకెళ్తున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని కోరారు.

అత్యాచార కేసులో యువకుడు అరెస్టు

ప్రజాశక్తి- గరివిడి



పోలీసుల అదుపులో ఉన్న యువకుడు

బాలికను మోసగించి అత్యాచారం చేసిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి ఎఎస్‌చక్రవర్తి, సిఐ సంజీవరావు, ఎస్ఐ ఎల్.దామోదర రావు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. గరివిడి మండలం వెదుళ్ల వలసకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వర్రి శివరాం ప్రేమించాడు. ఈ విషయం గ్రామ పెద్దలకు ఆమెతల్లి చెప్పడంతో శివను మందలించారు. తరువాత శివరాం ఏలూరు ఉపాధి కోసం వెళ్లిపోయాడు. అయినా బాలికకు మాయమాటలు చెప్పి ఏలూరు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధితురాలి ఫిర్యాదుమేరకు శివరాంను పోలీసులు అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సురక్షతో సేవలు మరింత చేరువ


నెల్లిమర్ల.. ధ్రువపత్రాలు అందజేస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేయడానికి జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు తెలిపారు. గురువారం మండలంలోని సీతారామునిపేటలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడుతో కలిసి ఎమ్మెల్సీ లబ్ధిదారులకు 11 రకాల ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీతారామునిపేట, కొత్తపేట, గొర్లిపేట సర్పంచులు రాంబారికి రామలక్ష్మి, అట్టాడ శ్రీను, నడుపూరు గౌరి, ఎంపిటిసి మిరప శాంతి కుమారి, ఎంపిడిఒ గంటా గిరిబాల, డిటి డి.శైలజ పాల్గొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని రెండో వార్డు సచివాలయంలో లబ్ధిదారులకు 880 ధ్రువపత్రాలను చైర్‌పర్సన్ బంగారు సరోజినీ అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కె.వి.కృష్ణారావు, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, కార్పొరేషన్ల డైరెక్టర్లు జనా ప్రసాద్, నౌపాడ శ్రీనివాసరావు, కమిషనర్ పి.బాలాజీప్రసాద్ పాల్గొన్నారు.


కొత్తవలస.. జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి గోపమ్మ


డెంకాడ : మండలంలో మోదవలస, గొలగాం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో 623 ధ్రువపత్రాలను ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మి నాయుడు, ఎంపిడిఒ స్వరూపరాణి, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, సర్పంచులు కనకల రామారావు, అప్పలనాయుడు, ఈశ్వరరావు, రమణరాజు, రాష్ట్ర డైరెక్టర్ బోని అప్పలనాయుడు, అప్పన్న, జి.ఆది, జెసిఎస్ కన్వీనర్ సారిక గౌరి పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలో నిమ్మలపాలెం, ఉత్తరాపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, తహశీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపిడిఒ వై.పద్మజ లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ బొంత వెంకట్రావు, అప్పన్నపాలెం, నిమ్మలపాలెం, ఉత్తరాపల్లి, చిన్నిపాలెం సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాడంగి : బాడంగి, భీమవరం సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి బోగి గౌరి ఆధ్వర్యాన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ మరిపి శంకర్, తెంటు మధుసూదన్, వైస్ ఎంపిపి ఎస్.భాస్కరరావు, సర్పంచ్ కండి రమేష్, ఎంపిటిసి శ్రీను, సచివాలయ కన్వీనర్ తెర్లి శ్రీనివాస్, ఎంపిడిఒ ఆంజనేయులు, డిటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు మేలు జరుగుతోందని మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. గురువారం నగరంలోని 39, 40, 41, 42, 43 సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 2,200 ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీరాములునాయుడు, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, డివిజన్ కార్పొరేటర్లు భోగాపురపు లక్ష్మి, జివి రంగారావు, జోనల్ ఇన్‌ఛార్జులు బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి, మారం బాల బ్రహ్మారెడ్డి, వైసిపి నాయకులు భోగాపురపు రవిచంద్ర, బాలి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


బాడంగి.. ధ్రువపత్రాలు అందజేస్తున్న జెసిఎస్ మండల కన్వీనర్ శంకరరావు


డెంకాడ.. ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపిపి వెంకట వాసుదేవరావు

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-బొబ్బిలి

వైసిపి పాలనలో మహిళలకు రక్షణ లేదని టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు అన్నారు. మహిళలపై దాడులకు నిరసనగా గురువారం పట్టణంలో టిడిపి ఆధ్వర్యాన ర్యాలీ చేపట్టారు. గొల్లపల్లి దాడితల్లి ఆలయంలో మహిళలకు రక్షణ కల్పించాలని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్లను బాగు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో 23వ వార్డు పరిధిలో ఉన్న పుల్లేరువలసలో గిరిజనుల ఇళ్లు శిథిలావస్థకు చేరాయని, అధికారులు, ప్రభుత్వం స్పందించి బాగు చేయాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వర్షాలకు పాడైపోయిన ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. గిరిజనుడి ఇల్లు రాత్రి సమయంలో శ్లాబ్ పెచ్చులు ఊడి పడిపోవడంతో గిరిజనులు నివసించేందుకు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు.

నారుమడుల పరిశీలన

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని రేజేరు, ఆనవరం గ్రామాల్లో వరి నారుమడులను గురువారం ఎఒ కె.శిరీష పరిశీలించారు. ముందుగా ఆర్‌బికెలను సందర్శించారు. వరి నారుమడుల్లో జింక్ లోపాన్ని గుర్తించి, నివారణకు రైతులకు సూచనలు చేశారు. సేంద్రీయ ఎరువుల వినియోగం వల్ల ప్రయోజనంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఇఒ పుష్పలత, విఎఎ సాయికుమార్ పాల్గొన్నారు.


వేపాడ.. కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న సిఎస్‌ఎ వెంకటరావు

'బ్రహ్మాస్త్రం'పై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలో ఒమ్మి గ్రామంలో రైతులకు బ్రహ్మాస్త్రం తయారీపై గురువారం ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి వర్రి గాయత్రి అవగాహన కల్పించారు. బ్రహ్మాస్త్రం వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఐసిఆర్‌పిలు ఎ.రామలక్ష్మి, ఎల్.దుర్గారావు, ఎస్.కృష్ణమూర్తి నాయుడు, మోడల్ మేకర్ కె.లక్ష్మి పాల్గొన్నారు.

వేపాడ : కెజిపూడి పంచాయతీ పరిధిలోని రామస్వామిపేటలో సామూహికంగా కషాయాల తయారీపై రైతులకు సుస్థిర వ్యవసాయ కేంద్రం సిఎస్‌ఎ వెంకటరావు అవగాహన కల్పించారు. సమావేశంలో విఎఎ కె.శివ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ యాప్‌లను నిషేధించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆన్‌లైన్‌లో అనేక రకాల యాప్‌లతో మోసాలకు పాల్పడుతున్న నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలని, ఆన్‌లైన్ బెట్టింగ్ మొదలైన యాప్‌లను తక్షణమే ప్రభుత్వం నిషేధించాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసి కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఆన్‌లైన్ యాప్‌ల వల్ల కలిగే నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. ప్రజల్ని ఇబ్బంది పెట్టే ముఠాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలో 34వ డివిజన్‌లో రూ. 37.10 లక్షలతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి శంకుస్థాపన చేశారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఎదురుగా పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సమస్యను తమ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పరిష్కారాన్ని చూపుతున్నారని అన్నారు. నగరంలో రూ.10కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నా మన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలను కూడా చేయనున్నట్లు చెప్పారు. ప్రధాన జంక్షన్ల అభివద్ధితో పాటు ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, పార్క్ అభివృద్ధి కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని వెలమ కమ్యూనిటీ భవనంలో గురువారం మాజీ సైనిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రారంభించారు. వైద్య శిబిరం ప్రజలకు ఎంతో దోహదం చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి అనీల్ నీరుకొండ దంత వైద్యశాల వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.అప్పారావు, బొబ్బిలి అధ్యక్షులు ఆర్.దామోదర్, సభ్యులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీధర్

చైన్ స్నాచింగ్ కేసులో దొంగ అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించారు. ఈ మేరకు గురువారం డిఎస్‌పి శ్రీధర్ మీడియాకు చోరీ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. రాజ్‌మహల్ కాలనీకి చెందిన మహిళ అల్లు సరోజిని ఈనెల 17న సంతోషిమాత ఆలయానికి వెళ్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెల తాడును తెంచుకుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. లక్నోకు చెందిన సతీష్ కుమార్ బెట్టింగులో డబ్బులు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే లక్ష్యంతో బొబ్బిలి వచ్చాడు. చోరీకి సంబంధించి సిసి పుటేజీల ఆధారంగా నిందితుడి కోసం ఎస్‌ఐ భాగ్యం, సిబ్బంది గాలించారు. రైల్వే స్టేషన్ వద్ద పోలీసులను చూసి సతీష్ పారిపోయాడు. పోలీసులు ఆయన్ను వెంబడించి పట్టుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డిఎస్‌పి శ్రీధర్ చెప్పారు. మూడు రోజుల్లో కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు, ఎస్‌ఐ భాగ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

ఎంఇఒ పి.బాల భాస్కరరావు ఆధ్వర్యాన మండలంలోని అన్ని పాఠశాలలకు రసాయనశాస్త్రం పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. రేషన్ పంపిణీ (ఎండియు) వాహనంపై పుస్తకాలను పాఠశాలలకు చేరవేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వేపాడ జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు శ్రీవల్లి, సిఆర్‌పిలు రాంప్రసాద్, కోటీశ్వరరావు, లక్ష్మి, మౌనికలు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయకుంటే సమ్మెకు సిద్ధం

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్


బొబ్బిలిలో నిరసన దీక్ష చేపడుతున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి మాట నిలబెట్టుకోవాలని, లేని పక్షంలో ఆగస్టు 15 తరువాత ఏ రోజు నుంచైనా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తామని సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్ తెలిపారు. ఈ మేరకు గురువారం నగర పాలక సంస్థ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాసంకల్ప యాత్రలో భాగంగా, మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని ప్రకటించారని, ఇప్పుడు 'ఆప్కాస్ 'లో ఉన్నారు కాబట్టి పర్మినెంట్ ఎలా చేస్తామని అనడం సరికాదని అన్నారు. మున్సిపల్ రంగంలో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా జూలై 27న మున్సిపల్ కార్యాలయాలు, ఆగస్ట్ 7న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని, ప్రభుత్వం స్పందించక పోతే ఆగస్ట్ 15 తరువాత సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ కార్మికులకు కనీస వేతనం రూ.24 వేలు ఇవ్వాలని, విలీన ప్రాంత కార్మికులను కార్పొరేషన్ కార్మికులుగా గుర్తించాలని, డిమాండ్ చేశారు. వినతి అందజేసిన వారిలో యూనియన్ సభ్యులు రాఘవ, సూరిబాబు, నాగరాజు, వరలక్ష్మి, మధుబాబు పాల్గొన్నారు.

బొబ్బిలి : మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన సిఎం జగన్మోహన్ రెడ్డి నేటికీ హామీని నిలబెట్టుకోలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా కార్మికుల వేతనాలు పెరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు జి.గౌరేష్, జె.రామారావు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కుళాయిల్లో మురుగునీరు

సమస్యను పరిష్కరించిన కమిషనర్

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీ పరిధి మల్లమ్మపేటలో కుళాయిల ద్వారా మురుగునీరు రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య పనులను పరిశీలించేందుకు కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు మల్లమ్మపేటలో గురువారం పర్యటించడంతో మహిళలు సమస్యను కమిషనర్‌కు వివరించారు. స్పందించిన కమిషనర్ సమస్యను పరిష్కరించాలని అక్కడే ఉన్న మున్సిపల్ ఎఇ సురేష్ ను ఆదేశించారు. వెంటమే లీకులను గుర్తించి, నివారించారు. దీంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఆయనతో కౌన్సిలర్ ఇంటి గోవిందరావు, అధికారులు ఉన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బొద్దాం గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడుతూ పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యాలయానికి వచ్చిన రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి పద్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఆన్‌లైన్‌లో వివరాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

మోడల్ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పెదమేడపల్లి ఎపి మోడల్ పాఠశాలను గురువారం డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి ఆకస్మికంగా సందర్శిం చారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఉపాధ్యాయుల పనితీరుపై ఆయన మండిపడ్డారు. ఈ విషయంలో ప్రిన్సిపల్, సిబ్బందికి విద్యావిషయక సూచనలు అందించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటినుంచే ప్రణాళికలు అమలుచేయాలని ఆయన ఆదేశించారు. విద్యార్థినుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మధ్యాహ్న భోజనానికి కట్టెలను ఉపయోగించకుండా గ్యాస్‌పైనే వండాలని నిర్వాహకులకు చెప్పారు. జగనన్న విద్యాకానుక కిట్లు పూర్తి స్థాయిలో అందాయా? లేదా? అని విద్యార్థులను ఆయన అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ బోర్డులను తనిఖీలు నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుమంత్, వైస్ ప్రిన్సిపల్ జి.వేణుగోపాలం పాల్గొన్నారు.


మోడల్ స్కూల్ సిబ్బందితో మాట్లాడుతున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

బిజెపి పాలనలో మహిళలకు రక్షణ కరువు



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, మహిళలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బిజెపి పాలనలో మహిళలకు రక్షణ కరువైందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు ఆందోళన వ్యక్తంచేశారు. మణిపూర్ మహిళలపై అత్యాచారం, అల్లర్లకు వ్యతిరేకంగా పాకీవీధిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలు, దళితులు, గిరిజనులకు రక్షణ లేదన్నారు. ఇద్దరు మహిళలను అర్ధనగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేయడం దుర్మార్గమన్నారు. మణిపూర్‌లో రెండు జాతుల మధ్య గొడవలు జరుగుతున్నా ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. దాడులను ఆపకుండా ప్రధాని మోడీ ఖండిస్తున్నట్లు ప్రకటించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. కార్యక్రమంలో జె.పార్వతి, అలివేలు మంగ, బి.సత్యవతి, జి.గౌరేష్, జె.రామారావు పాల్గొన్నారు.

గడపగడపకూ కోలగట్ల


ప్రభుత్వ పథకాలపై ఆరాతీస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో 4 డివిజన్ పరిధిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అమలు తీరును తెలుసుకున్నారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ పాలన పట్ల, అందుతున్న పథకాలు పట్ల ప్రజాస్పందన అనూహ్యంగా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, 5వ డివిజన్ కార్పొరేటర్ గాదం మురళి, వైసిపి నాయకులు కేపీపీ రాజు, చిట్టెళ్ల రాంబాబు, వజ్రపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జనరంజక పాలన సాగిస్తోందని నగర డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయ యాదవ్ అన్నారు. 23వ డివిజన్ పరిధి బొండాడ వీధి, ఉల్లి వీధి పరిసర ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్తూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు కాలువలు, విద్యుత్తు సంబంధిత సమస్యలను తీసుకురాగా.. వెంటనే పరిష్కారానికి తగు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు కేదారశెట్టి లక్ష్మణ మూర్తి, కన్వీనర్ నాగబాబు, స్థానిక నాయకులు, పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

సుఖ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యాన గురువారం ఖైదీలకు సుఖవ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం ఉచితంగా హెచ్ఐవి, సిఫిలిస్, హెపటైటిస్-బి, హెపటైటిస్-సి, క్షయ పరీక్షలు నిర్వహించారు. జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పి. బాలాజీ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ తమ జీవితంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ టి.సంపత్ కుమార్, జిల్లా కేంద్రాస్పత్రి సుఖవ్యాధుల విభాగం కౌన్సిలర్ డి. త్రినాథ్, సూపర్‌వైజర్ ఎల్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.